# ఉచితం

**"కాఫీ" అంటూ** కేకపెట్టాడు శంకరం టక్ సరిచేసుకుంటూ.

"కాఫీయా, పాడా ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి" ముఖం చిట్లిస్తూ అసహనంగా అంది పార్వతి.

"అయితే ఇవాల్టికి కాకా విలాస్ తప్పదన్న మాట" అనుకున్నాడు శంకరం తనలోతను.

ఆ మాటలు పార్వతికి వినించాయో యేమో మీరు ఏ విలాస్‌కీ పోనక్కర్లేదు. ముందు బజారుకెళ్ళి ఈ సామాన్లు కట్టించుకు రండి అన్నది భర్త చేతికి చీటీ అందిస్తూ.

"ఏమిటోయ్ ఈ నెలలో సరకుల జాబితా జెర్రిపోతులా పెరిగిపోయింది. లిస్టు వంక చూసి గుండెలు బాదుకున్నంత పనిచేశాడు శంకరం.

అలానా మహాశయా మరి సంసారం పెరగడం లేదా చేంతాడులా."

పార్వతి మాటలలో వెక్కిరింపు ధ్వనించింది.

ఆమె వెటకారమాడుతోందని తెలిసినా "అక్షరసత్యాన్ని వక్కాణించావ్" అంటూ చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు శంకరం.

అప్పటికే ముస్తాబై కాన్వెంటు కెళ్ళేందుకు సిద్ధమైన పిల్లలిద్దరూ తండ్రి దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

చిన్నవాడిని రాడ్‌మీద, పెద్దమ్మాయిని క్యారేజ్ మీద కూర్చోబెట్టి సైకిలు ఎక్కబోయాడు శంకరం.

"చూడండి, గుడ్డెద్దు చేలో పడ్డట్టు సామాన్లన్నీ ఒకేచోట కట్టించుకుని మోసుకురావడం కాదు. ఏయే సరుకులకి ఉచితంగా ఏమేమిస్తున్నారో నాలుగు చోట్లా భోగట్టా చేసి మరీ పట్టుకురండి. పాత స్టాకులు కొత్తస్టాకులు ఉంటాయి."

"చిత్తం"

"చెప్పడం మరిచాను. ఐదొందల గ్రాముల కాఫీ పొట్లంతో ఓ కాఫీ కప్పు ఉచితమట. అలాగే అదేదో కంపెనీ వాళ్ళు నాలుగు బట్టల సబ్బులు కొంటే ఓ సబ్బుపెట్టె ఉచితంగా ఇస్తున్నారని అంటున్నారు. అవన్నీ జాగ్రత్తగా కనుక్కుని..."

"అలాగే కనుక్కుంటాన్లే ఈనెల సరకుల్లో దేనికైనా స్కూటరు ఉచితంగా ఇస్తారేమోనని నాకూ ఆశగానే ఉంది.

"చాల్లెండి సంబడం. పరిహాసానికైనా అర్థం ఉండాలి. అన్నట్లు ఇదుగో దీన్ని చూశారా?... బుజ్జిముండ ఎంత ముద్దుగా ఉందో" స్టెయిన్‌లెస్ స్టీలు టిఫినుబాక్సు తీసి చూపిస్తూ మురిసిపోతుంది పార్వతి.

"వందో యాభయ్యో తగలేసి కొన్న వస్తువు ముద్దుగా గాక మొద్దుగా ఉంటుందా?"

"నేనేం దీన్ని కొనలేదు"

"అయితే కొట్టుకొచ్చి ఉంటావ్"

"ఛ... అవేం మాటలండి. వంద రూపాయలు కట్టి స్కీములో చేరినందుకు దీన్ని ఉచితంగా ఇచ్చారు."

"స్కీమా?!" నోరెళ్ళబెట్టి భార్య వంకా ఆశ్చర్యంగా చూశాడు శంకరం.

"పదండి నాన్నా బడికి టైమవుతోంది" చిరాగ్గా కాళ్ళు ఆడించాడు చిన్నవాడు.

"నువ్వుండరా మీ అమ్మ స్కీములో చేరిందట. మన అదృష్టం పండి స్కూటరుగాని తగిలిందో ఈ దెబ్బతో మనం ఈ డొక్కు సైకిలుకి గుడ్‌బై చెప్పేయొచ్చు."

"అబ్బ ఎంత ఆశ?" మారుతీ కారొద్దా?" వెటకారమాడింది పార్వతి.

మరి మాట్లాడకుండా సైకిలెక్కేశాడు శంకరం.

లోపలకు వెళ్ళబోయిన పార్వతి కూరల తాతను గమనించి ఆప్రయత్నం విరమించింది.

వంకాయలు, బీరకాయలు, దొండకాయలమ్మా...

పార్వతమ్మను చూసి దగ్గరకొచ్చాడు కూరల తాత.

"వంకాయలెలా ఇచ్చావ్ తాతా."

"కిలో ఎనిమిదమ్మా" అన్నాడు కూరల వాడు.

"అమ్మో" నోటి మీద వేలేసుకుంది పార్వతి.

"ఏం చేయమంటావ్ తల్లీ. తుపానుకి తోటలన్నీ మట్టికొట్టుకుపోయాయి."

"సరేలే ఓ పావుకిలో వంకాయలు తీసుకుంటాను ఓ బీరకాయ ఉచితంగా ఇస్తావా?"

"అదేటమ్మా" విస్మయంగా చూశాడు కూరల తాత.

"అలా నోరు వెళ్ళబెట్టకు. దోమలు దూరిపోగలవు. నీకు తెలుసునో తెలీదో నాకు తెలీదుగాని సరుకులు జోరుగా అమ్ముడైపోవడానికి ఉచితంగా ఏదో ఒకటి వాటికి జోడిస్తున్నారీ మధ్య."

నా కవనన్నీ తెలవవమ్మా, కొంటే కొనండి నేకపోతే నేదు."

"సరేలే. నీ కూరలేం నా కక్కర్లేదు వెళ్ళిరా.

బేరం గిట్టుబాటు కాకపోవడంతో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు కూరల తాత.

వంట చేద్దామని కూరల బుట్ట తెరిచింది పార్వతి అందులో ఏ కాయా లేకపోవడంతో అనవసరంగా కూరలు తాతని పంపేసినందుకు బాధపడింది. ఏం వండాలో తెలియక ఆలోచిస్తూ చతికిలబడిపోయింది. అలా ఎంతసేపు ఉండిపోయిందో ఆమెకే తెలీదు.

శంకరం వచ్చాడు.

"ఉత్త చేతుల్తో వచ్చారేం?" బజార్లో సరుకులేవా?" పరిహాసమాడింది. పార్వతి.

"ఎందుకు లేవూ బస్తాలతో ఉన్నాయి.

"మరి సంచి తిరగేసుకొచ్చా రేం."

"అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు సరుకులెన్ని ఉన్నా వాటిలో వేటికి ఉచితమనేది లేదు. నన్నేం చేయమంటావ్. అందుకే బజారంతా గాలించి ఉప్పు మాత్రం పట్టుకొచ్చాను. దీనికి ఒక అగ్గిపెట్టె ఉచితంగా ఇచ్చారు"

"గొప్ప పనిచేశారు"

"అది సరే టిఫిను ఏదైనా చేస్తావా లేదా. స్కూలుకి టైమవుతోంది" చిరాకు ప్రదర్శించాడు శంకరం.

"ఎందుకు చేయను? భేషుగ్గా చేస్తాను. సరుకులు పట్టుకొచ్చారు కదా!.. ఉండండి మీరు తెచ్చిన ఉప్పుతో ఉప్పుపిండి చేసిపెడతాను.

"చాల్లే నీ దెప్పి పొడుపులు. ముందు ఈ రుమాళ్ళు ఎలా ఉన్నాయో చూసి చెప్పు" మ్యాజిక్ చేసినట్లు సడన్‌గా జేబులోంచి నాలుగు కర్చీఫులు బయటకు తీశాడు శంకరం.

వెయ్యి వోల్టుల విద్యుత్ బల్బులా వెలిగిపోయింది పార్వతి ముఖం. వెంటనే వాటిని లాక్కుంటూ "ఎంత బావున్నాయో రుమాళ్ళు" అంటూ మళ్ళీ మురిసిపోయింది.

"ఇవన్నీ..." ఏదో చెప్పబోయి ఆగిపోయాడు శంకరం.

"ఉచితంగా ఎవరిస్తారు లెండి. కొనే ఉంటారు. ఇంతకూ ఇన్ని రుమాళ్ళు కొన్నందుకు వాడేదైనా ఉచితంగా ఇచ్చిచచ్చేడా లేదా? ముందు ఆ మాట చెప్పండి."

"ఇవే ఉచితంగా వస్తే వీటికి ఉచితంగా ఇంకేమిస్తారు"

భర్త మాటలు అర్థంగాక అయోమయంగా చూసింది పార్వతి.

"మొన్న మా స్కూల్లో ఏం జరిగిందో తెలుసా? నీకు ఎప్పటికప్పుడు చెప్పాలనుకుని మరచి పోతున్నాను."

'కథలు చెప్పొద్దు. జరిగిందేదో టూకీగా చెప్పండి నాకు అవతల బోలెడంత పనుంది."

"చెబుతా... నన్నింతకీ నోరు విప్పనిస్తావా" అన్నాడు శంకరం భార్య నాన్‌స్టాప్ వాక్ ప్రవాహానికి అడ్డు తగులుతూ.

"చెప్పండి మహాప్రభూ" నోరు నొక్కుకుంది పార్వతి.

"ఓ బట్టల మిల్లు ఏజెంటు మా స్కూలుకొచ్చి నెంబర్ వన్ రకం శాంపిల్ దుప్పట్లు చూపించి ఒక్కొక్కటి తొంభై అన్నాడు. ముందుగా సగం సొమ్ము చెల్లిస్తే మిగిలిన డబ్బుకి మిల్లువాళ్ళు వి.పి.పి. పార్శిలు పంపిస్తారట. ఆర్డర్ ప్లేస్ చేసినందుకు ఈ రుమాళ్ళు ఉచితంగా ఇచ్చాడు.

పెనిమిటి మాటలను నమ్మలేనట్లు చూసింది పార్వతి.

"నీకింకో షాకింగ్ న్యూస్" అన్నాడు శంకరం.

"సస్పెన్సు పెట్టి చంపక చెప్పేదేదో త్వరగా చెప్పండి" అంది పార్వతి విసుక్కుంటూ.

"రెండు దుప్పట్లు కొంటే ఒక దుప్పటి ఉచితం" సినిమా సాంగ్ ఫక్కీలో రాగం తీశాడు శంకరం.

"అటువంటప్పుడు ఓ డజను దుప్పట్లకి ఆర్డరివ్వలేకపోయారా?"

"అన్ని మనం ఏం చేసుకుంటాం చెప్పు. అక్కడికీ ఓ అరడజను కావాలన్నాను.

"మీరు మరీ నండి. దుప్పట్లేవైనా తుప్పుపడతాయా? మనకక్కర్లేకపోతే పదో పరకో ఎక్కువకి అమ్మేసుకుంటాం" అంది పార్వతి లక్కీ ఛాన్సేదో మిస్ అయినట్లు నొచ్చుకుంటూ.

"నీ అతి తెలివికి సంతోషించాం గాని బడికి టైమవుతోంది వస్తాను" రిస్టువాచీ చూసుకుంటూ వెళ్ళిపోయాడు శంకరం.

ఆ రోజు ఆదివారం బడికి సెలవవడం వల్ల ఇంటి దగ్గరే ఉన్నాడు. శంకరం. పిల్లలు వరండలో కుప్పి గంతులేస్తున్నారు.

"నేను చెప్పిన పని ఏం చేశారు?" అడిగింది పార్వతి భర్త దగ్గరకొచ్చి.

క్వస్చెన్ మార్కులా ఫేస్ పెట్టాడు శంకరం.

"మీ మతిమరుపు మంచం ఎక్కా.. అడుగుతోంది మిమ్మల్నే చీర సంగతండి అప్పుడే మరచిపోయారా? ఆరు గజాల చీర తడపడంతోనే ఆరడుగులు అయిపోయింది. ఎంతైనా ఇంత మోసం ఉంటుందనుకోలేదు."

"ఓహో అదా! అడిగాన్లే."

"మరి చెప్పరేం.

అందుకు వాడేమన్నాడో తెలుసా?"

"ఇంకే మంటాడు. ముదరా మరోటిస్తా నంటాడు."

"అదేం కాదు, చీరల్లో నాణ్యత లోపించబట్టే మరో చీర ఉచితంగా ఇచ్చామన్నాడు. వాడు చెప్పింది సబబుగానే ఉంది. పోనీ నువ్వో పని చేయరాదూ"

ఏమిటన్నట్లు చూసింది పార్వతి.

"ఆ రెండు చీరలతో రెండు లంగాలు కుట్టించేస్కో" గొప్ప సలహా ఇచ్చారు. ఇదన్నమాట మీ నిర్వాకం"

"జరిగిపోయిందాని గురించి చింతిస్తూ కూర్చునే బదులు ఏదో ఒకటి చేయడం మేలు కదా"

"ఏమిటోనండి. ఉచితంగా ఏదో వస్తోందని ఆశకు పోయి అసలుకే మోసపోతున్నాం."

పశ్చాత్తాపం ఆమె మాటల్లో కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

"మరేం ఫరవాలేదు. జరిగిపోయిందాని గురించి నువ్వేం దిగులు పడకు" ఓదార్పుగా అన్నాడు శంకరం.

అది కాదండీ నా బాధ. మొన్నటికి మొన్న టిఫిను బాక్సు ఉచితంగా ఇస్తున్నారని స్కీములో చేరానా?"

"అయితే ఇప్పుడేమైందని."

"ఏం చెప్పమంటారు. పైకి అనుకుంటే సిగ్గు ఆ స్కీము వాడు అందరి దగ్గరా అందినంతా

అందుకుని ఉడాయించేశాడు."

"నిన్ను స్కీములో చేరమని ఒత్తిడి చేసిన పంకజాక్షమ్మ ఏమంటుంది?"

"నిజానికి వాడెవడో ఆవిడకూ తెలియదట. పదిమంది మెంబర్సుని చేర్పిస్తే ఆవిణ్ణి స్కీములో ఉచితంగా చేర్చుకుంటానన్నాడట. అందుకని అతడిని తెలుసున్నట్లు అబద్ధమాడింది" అని చెబుతూ కంట తడిపెట్టింది పార్వతి.

అర్ధాంగి కళ్ళల్లో మొట్టమొదటిసారిగా కన్నీరు చూసి చలించిపోయాడు శంకరం.

మాటల్లో 'మాష్టారూ!' అంటూ లోపలకొచ్చాడు సీతారామయ్య. అతను కూడా శంకరం పనిచేసే స్కూల్లోనే పనిచేస్తున్నాడు.

"రండి మాష్టారు కూర్చోండి" కుర్చీ చూపించాడు శంకరం.

కాఫీలు పట్టుకొచ్చింది పార్వతి.

"మీరీ విషయం విన్నారా?" కాఫీ కప్పు అందుకుంటూ అన్నాడు సీతారామయ్య.

ఆదుర్దాగా చూశారు శంకరం దంపతులు.

"ఆ మధ్య మనం దుప్పట్లకి ఆర్డరిచ్చాం గుర్తుందా" అంటూ మొదలుపెట్టాడు సీతారామయ్య.

"ఔనూ" అన్నాడు శంకరం.

"మిల్లు వాళ్ళ దగ్గర నుండి ఎంతకీ పార్శిలు రాకపోవడంతో మన హెడ్ మాస్టరుగారు రిజిష్టర్ పోస్టులో ఉత్తరం రాసారు. అది 'నాట్‌ఫౌండ్' అని తిరిగొచ్చేసింది. అంటే ఆ మిల్లు అక్కడ లేదన్నమాట.

"దొంగ రాస్కెల్. మిల్లు ఏజెంటునని ఎంతెలా నమ్మించాడు? ఎన్ని నక్క వినయాలు నటించాడు. మనమంతా అదేదో మిల్లుంది కాబోలనుకున్నాం. ముష్టి వెధవ ప్రింటెడు రసీదులు కూడా ఇచ్చాడు. ఉండండి ఇప్పుడే వెళ్ళి పోలీస్ రిపోర్టు ఇచ్చి వస్తాను" ఉద్రేకంతో ముక్కుపుటా లెగరేస్తూ లేచాడు శంకరం.

"చేతులు కాలేక ఆకులు పట్టుకుని ఏం లాభం మాష్టారు. ముందే మనం కాస్త మెళకువగా వుంటే ఇలా మోసానికి గురయ్యేవాళ్ళం కాదు" అన్నాడు సీతారామయ్య.

"ఔనండి అన్నయ్యగారూ, బుద్ధి వచ్చేటట్లు చెప్పారు. నా ప్రేరణ వల్లే ఆయన ఇలా తయారయ్యారు. ఉచితంగా ఏం వచ్చినా విడిచిపెట్టకూడదని కాపురానికి వచ్చిందగ్గర నుండి చెవిని ఇల్లుకట్టుగుని పోరుతున్నాను. ఈ భ్రమలో పడి మేం దుప్పట్లే కాదు, చాలా పోగొట్టుకున్నాం. చెప్పుకుంటే సిగ్గు. వస్తువు, నాణ్యతా, అమ్మేవాడి నిజాయితీ చూడాలే తప్ప ఉచితంగా ఏదో వస్తోందన్న ఆశకు పోకూడదని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాం" అంది పార్వతి.

"నిజమే చెల్లెమ్మా. ఇప్పటికైనా మనమంతా ఉచితం అనే మత్తులోంచి బయటపడ్డాం' అంటూ లేచాడు సీతారామయ్య.

**(26-06-1997 మహిళ ఆంధ్రప్రభ డైలీ అనుబంధం)**